# ప్రగతి పథం

**మారిన 92వ వార్డు రూపురేఖలు**
- కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు
- ప్రజలకు చెంతనే సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


ఎస్సీబీసీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు


పద్మనాభనగర్‌లో నిర్మిస్తున్న కాపు కల్యాణ మండపం

**గోపాలపట్నం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారు. ఏళ్ల తరబడి అభివృద్ధి ఫలాలు అందని ప్రాంతాలను సైతం ప్రగతి బాట పట్టిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన వసతులు కల్పిస్తున్నారు. ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ వైద్యాన్ని చేరువ చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారు. జీవీఎంసీ 92వ వార్డులో దీర్ఘ కాలిక సమస్యలను సైతం పరిష్కరించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు చొరవతో ఇది సాధ్యమైందని స్థానికులు కొనియాడుతున్నారు.

**అభివృద్ధి పనులకు నిధుల వరద**

వార్డులోని పలు ప్రాంతాల్లో 94 పనులకు రూ18.90 కోట్లు వెచ్చించారు. నాడు- నేడు ద్వారా హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్ రూపురేఖలు మార్చారు. వెంకటాపురం, పద్మనాభనగర్, ఎస్సీబీసీ ప్రాథమిక పాఠశాలల్లో నాడు నేడు పనులు చేపడుతున్నారు. టీడీపీ హయాంలో నిలిచి పోయిన కాపు కల్యాణం మండపం పనులు చురుగ్గా సాగుతున్నాయి. రూ.2 కోట్లతో రెండంతస్తుల కాపు కల్యాణ మండపం నిర్మిస్తున్నారు. ఈ కల్యాణ మండపం పనులకు టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసి గాలికి వదిలేసింది. దీంతో విషయాన్ని బెహరా భాస్కరరావు ద్వారా ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేకంగా రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పనులు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ ద్వారా రూ.80 లక్షలు ఖర్చు చేసి కాల్వలు రహదారుల పనులు చేపట్టారు.

**పరిష్కారం దిశగా దీర్ఘ కాలిక సమస్య**

మేహాద్రి గెడ్డ నిర్వాసితులైన పద్మనాభనగర్, కంపరపాలెం, ఎస్సీబీసీ కాలనీ నిర్వాసితులకు శాశ్వత హక్కులు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 40 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్య పరిష్కరించేందుకు ప్రభుత్వం చొరవ చూపించడంపై ఈ ప్రాంత వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం ద్వారా ఇక్కడి వారి సమస్య పరిష్కరించాలని లెక్టర్‌కు ప్రభుత్వం నుంచి లేఖ రావడంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.మేహాద్రి గెడ్డ నిర్మాణానికి పద్మనాభనగర్ వాసులు 1975లో, కంపరపాలెం గ్రామస్తులు 1982లో తమ ఇళ్లు, భూములు ఇచ్చారు. వీంతో పద్మనాభనగర్ వాసులకు 76, 76ఏ సర్వే నంబర్లలో 308 పట్టాలు, కంపరపాలెం వాసులకు 70, 71, 73 సర్వే నంబర్లలో 215 ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అయితే వీటిపై ఏవిధమైన హక్కులు లేకోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టిందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


రూపు రేఖలు మారిన హెచ్‌సీ వెంకటాపురం స్కూల్


గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్


అదనపు అంతస్తు

### మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి



మా వార్డులో మునుపెన్నడూలేని విధంగా అభివృద్ధి జరిగింది. రహదారులు, కాల్వలు బాగు పడ్డాయి. వెంకటాపురం ప్రధాన గెడ్డ పనులు చురుగ్గా సాగాయి. దానికి ఆనుకుని రహదారి ఏర్పాటు చేసేందుకు మెటల్ దారి వేశారు. మా గ్రామంలో ప్రాథమిక పాఠశాలలు, హైస్కూల్‌లో అన్ని వసతులు కల్పిస్తున్నారు.

– లోకేష్ రెడ్డి, వెంకటాపురం

### మా కల నెరవేర్చిన నాయకుడు జగనన్న



మా కల నెరవేర్చిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. మా ప్రాంతంలో కాపు కల్యాణ మండపం కావాలని కోరుకుంటున్నాం. ఇది నెరవేరబోతోంది. అలాగే ఈ ప్రాంతంలో నిర్వాసితులకు ఇళ్లపై శాశ్వత హక్కులు కల్పించాలని విన్నవించాం. ఇది నెరవేర్చే విధంగా ప్రభుత్వం స్పందించింది. మేమంతా ఆయన వెంటే నడుస్తాం.

–సాలాపు మారయ్య, పద్మనాభనగర్

### ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నాం. మా ప్రాంతంలోని సమస్యలను మా నాయకుల దృష్టికి తీసుకెళ్లగానే వారు స్పందించి నిధులు విడుదల చేయిస్తున్నారు. అందుకే దీర్ఘకాలంగా ఉన్న సమస్యలు సైతం పరిష్కారమవుతున్నాయి. ఇందుకు పశ్చిమ ఇన్‌చార్జి ఆడారి ఆనంద్ కుమార్‌కు, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి మేమంతా కృతజ్ఞులమై ఉంటాం. కాపు కల్యాణ మండపం, మేహాద్రి గెడ్డ నిర్వాసితుల సమస్యలే కాకుండా పలు సమస్యల్ని పరిష్కరిస్తున్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీ వెంటే నడుస్తున్నారు.

– బెహరా భాస్కరరావు, జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు

## చురుగ్గా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు


నాగేంద్ర కాలనీలో సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురించి ఆరా తీస్తున్న గోపాలకృష్ణ

**గోపాలపట్నం:** జగనన్న కాలనీల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్లు చురుగ్గా సాగుతున్నాయి. జీవీఎంసీ 89వ వార్డులోని పలు సచివాలయాల్లో సిబ్బంది, ఆన్‌లైన్‌లో వచ్చిన పేర్లను బట్టి రోజువారీ రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. ఇక్కడి నాగేంద్ర కాలనీలో 461, 462 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వార్డు వైఎస్సార్ సీపీ క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఇబ్బందుల గురించి, అక్కడి సచివాలయ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్‌లో తప్పిదాలను సైతం సరిచేసే వెసులుబాటు ఉందని, పేర్లు..అక్షర దోషాల వంటివి సరిచేస్తున్నామని కార్యదర్శులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 461 సచివాలయంలో 200 ఇళ్ల స్థలాల లబ్ధిదారులు ఉండగా ఆన్‌లైన్‌లో సచివాలయానికి 80 మంది లబ్ధిదారుల వివరాలు వచ్చాయని, వారిలో 65మందికి రిజిస్ట్రేషన్లు చేశామని చెప్పారు. 462 సచివాలయంలో 186 మంది లబ్ధిదారులు ఉండగా ఆన్‌లైన్‌లో సచివాలయానికి 174 మంది పేర్లు రాగా.. 33 మందికి రిజిస్ట్రేషన్లు చేశారని చెప్పారు. మిగిలిన వారికి కూడా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. మిగిలిన సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

## గంజాయితో ఇద్దరి అరెస్ట్

**గోపాలపట్నం:** పాత గోపాలపట్నం అండర్ పాస్‌వే వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గోపాలపట్నం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు .. బెంగళూరుకు చెందిన సాహిద్ అఫ్రిద్, వసీమ్ పాషా ఒడిశా బోర్డర్ నుంచి 5 కిలోల గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. పాత గోపాలపట్నం నుంచి రైల్వే స్టేషన్ దారిలో వెళ్తుండగా పక్కా సమాచారంతో గోపాలపట్నం ఎస్ఐ అప్పలనాయుడు, సిబ్బంది వెంబడించివారి వద్ద వున్న బ్యాగులు పరిశీలించగా 5 కిలోల గంజాయి లభించింది. దీంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

## క్లుప్తంగా

### నేడు భీష్మ ఏకాదశి కల్యాణోత్సవాలు

**సింహాచలం:** భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని మంగళవారం శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన ఉపాలయాల్లో కల్యాణోత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి 9.30 గంటల నుంచి గ్రామ తిరువీధి, రి కల్యాణోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం 4 నుంచి గ్రామ తిరువీధి, రాత్రి 7గంటల నుంచి కల్యాణోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే మాధవదారలోని వేణుగోపాలస్వామి ఆలయంలో రాత్రి 7.30గంటల నుంచి కల్యాణోత్సవం, 9గంటలకు తిరయ వీధి నిర్వహిస్తామని తెలిపారు. భక్తులంతా కల్యాణోత్సవాల్లో పాల్గొని ఆశీస్సులు పొందాలని కోరారు.

### సంజీవ్‌రెడ్డిని కలిసిన ఇంటక్ ప్రతినిధులు


సంజీవ్‌రెడ్డితో పారిశ్రామిక ప్రాంత ఇంటక్ నాయకులు

**మల్కాపురం:** ఇంటక్ జాతీయ కార్యదర్శి సంజీవ్‌రెడ్డిని సోమవారం పారిశ్రామిక ప్రాంతంలోని పలు పరిశ్రమలకు చెందిన ఇంటక్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. షిప్‌యార్డ్,హెచ్‌పీసీఎల్,కోరమాండల్, ఎస్‌బీసీ,నేవల్ డాక్‌యార్డ్ తదితర పరిశ్రమల్లో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆయా పరిశ్రమల యాజమాన్యాలతో కార్మిక సమస్యలపై మాట్లాడి పరిష్కరించే విధంగా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఇంటక్ ప్రధాన కార్యదర్శి భోగవల్లి నాగభూషణం, షిప్‌యార్డ్ ఇంటక్ నాయకులు దాసు తదితరులు పాల్గొన్నారు.

### భారీ వాహనాల పార్కింగ్‌తో ఇక్కట్లు

**మల్కాపురం:** పారిశ్రామిక ప్రాంతంలోని ప్రధాన సర్వీసు రోడ్లపై భారీ వాహనాలను రోజుల తరబడి నిర్లక్ష్యంగా పలువురు వాహనదారులు పార్కింగ్ చేస్తున్నారు.దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మల్కాపురం నుంచి నౌసేనాభాగ్ వెళ్లే మార్గంలో లారీలు,ప్రైవేట్ బస్సులు,మినీ వ్యాన్లు,ఆటోలు, కార్లు ఇలా పలు రకాల వాహనాలను రోజుల తరబడి ఇరువైపుల పార్కు చేస్తున్నారు. దీంతో ఎదురుగా వచ్చే వాహనాన్ని గుర్తించలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ అధికారులు కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### నేడు కాకానినగర్‌లో ఆధార్ క్యాంప్

**విశాఖ విద్య:** జీవీఎంసీ 90వ వార్డు కాకానినగర్ సచివాలయంలో మంగళవారం ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు మౌళి తెలిపారు. ఆధార్ కార్డుల్లో చేర్పులు, మార్పులు, అప్‌డేషన్ వంటివి చేయించుకోదలచిన వారు తగిన ధృవ పత్రాలతో సచివాలయానికి రావచ్చన్నారు.

### ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

**కూర్మన్నపాలెం:** దేశంలో స్వాతంత్య్రం తర్వాత ప్రభుత్వరంగ సంస్థల వల్లే ఆర్థికాభివృద్ధి మెరుగు పడిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. అటువంటి సంస్థలను కాపాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1103వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలన్నారు.

## వేడుకగా బాబా విగ్రహ ప్రతిష్టాపన


భక్తులకు అన్నప్రసాదాన్ని అందిస్తున్న ఆనంద్ కుమార్, శ్రీధర్


విగ్రహ ప్రతిష్ట చేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

**విశాఖ విద్య:** జీవీఎంసీ 52వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయిబాబా ఆలయాన్ని మంగళవారం ఏపీఎంఎస్ఎంఈడీసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ప్రారంభించారు. షిర్డీ సాయి బాబా విగ్రహ ప్రతిష్టాపన అత్యంత వేడుకగా జరిగింది. ఉదయం ఆలయంలో వేదపండితులు శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ దంపతులు హోమం క్రతువును ప్రారంభించారు. ఆలయ ప్రారంభోత్సవానికి పరిసర కాలనీల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఆడారి ఆనంద్ కుమార్, డిప్యూటీ మేయర్ శ్రీధర్ స్వయంగా భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో జియ్యాని మారుతి తదితరులు పాల్గొన్నారు.

### నెహ్రూ అవార్డు ప్రదానం


భాస్కరరావుకు అవార్డు అందజేస్తున్న సీఎండీ భట్

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ ఇంజినీరింగ్ షాప్స్ అండ్ ఫౌండ్రీ విభాగంలోని ఫౌండ్రీ సెక్షన్ సీనియర్ ఫోర్‌మన్ సీహెచ్.భాస్కరరావుకు జవహర్‌లాల్ నెహ్రూ అవార్డు ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్ అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేసే ఉద్యోగులకు ఏటా జేఎన్ అవార్డులను అందజేస్తున్నారు. స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎండీ అతుల్ భట్ చేతుల మీదుగా భాస్కరరావు అవార్డు అందుకున్నారు. డైరెక్టర్లు డి.కె.మొహంతి, బాగ్చీ, ఎస్.సి.పాండే తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల పరిశీలన


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

**సింధియా:** జీవీఎంసీ 62వ వార్డు అంబేడ్కర్‌కాలనీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఇప్పటికే ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు పూర్తి చేశామన్నారు. మిగిలిన అభివృద్ధి పనులను కూడా త్వరిగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ ఆడారి ఆనంద్‌కుమార్ సారథ్యంలో వార్డులో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. ఆనంద్‌కుమార్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సుమారు రూ.140 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు.రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, దోమాన లక్ష్మి, ఈశ్వరరావు, ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన

- భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- యల్లపువానిపాలెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- వలంటీర్లకు సత్కారం


యల్లపువానిపాలెంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి


ముత్తంశెట్టి నుంచి పురస్కారాలు అందుకున్న వలంటీర్లు

**గోపాలపట్నం:** పాలనను ప్రజల వద్దకే తీసుకువచ్చిన నాయకుడు మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. యల్లపువానిపాలెం ప్రాంతంలోని పలు అభివృద్ధి పనులకు సోమవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇక్కడి మూడు సచివాలయాల పరిధిలో రూ.50 కోట్ల సంక్షేమ పథకాలు అందించామన్నారు. ఈ ప్రాంతంలో భగత్‌సింగ్ నగర్‌లోని రోడ్లు కాల్వలకు రూ.31.15 లక్షలు, అదే ప్రాంతంలో రూ.16.30 లక్షలతో రోడ్లు కాల్వల పనులకు, యల్లపువానిపాలెం మూడు గుడుల వద్ద రూ.30లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి, రూ. 31.17 కోట్లతో ధోబీఘాట్ నిర్మాణానికి, తుంపాల వీధిలో రహదారి కాల్వల నిర్మాణానికి ఆయన శంకుస్థాపనలు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ వల్లే సంక్షేమం సాధ్యమైందన్నారు. జనసేన-టీడీపీ ప్రభుత్వం వస్తే వలంటీర్లను తొలగిస్తామని, సచివాలయాలను తొలగిస్తామని చెబుతున్నారని ఎమ్మెల్యే అనగానే.. 'వలంటీర్లు కావాలని.. బాబు పవన్ కల్యాణ్ మాకు వద్దు' అని స్థానికులు ముక్త కంఠంతో చెప్పారు. వలంటీర్లు మంచి సేవలు అందిస్తున్నారని కొందరు మహిళలు చెప్పారు. ఇక్కడి సచివాలయాల పరిధిలో సేవా మిత్రలుగా ఎంపికైన వారిని ఆయన ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, గేదెల మురళీకృష్ణ, ఏపీడీ శ్రీరామ్, జోనల్ కమిషనర్ హేమావతి, ఏఈ వెంకటలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వ వికాసమే ఉత్తమ విద్య లక్ష్యం


విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు

**సింధియా:** వ్యక్తిత్వ వికాసమే ఉత్తమ విద్య లక్ష్యమని, అందుకు ఆటలు, పాటలు, సామాజిక సేవా కార్యక్రమాలు, వివిధ రకాల పోటీలు, పుస్తక పఠనం ఎంతగానో తోడ్పడతాయని సెయింట్ ఆన్స్ కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ గెసిల్లా అన్నారు. సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల సీనియర్ విద్యార్థినుల వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ జానిస్, సుపీరియల్ సిస్టర్స్ జయశీల, ఎల్సీ తదితరులు ఇంటర్మీడియట్ తర్వాత అందుబాటులో ఉన్న వివిధ రకాల కోర్సుల గురించి వివరించారు. అనంతరం ఎన్ఎస్ఎస్, విద్యలోనూ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, అధ్యాపకులు నదియా, సంధ్య, అనసూయ, ప్రేమలత, అబీదా, ఆదిలక్ష్మి, సుధ, జగన్, పరమేష్, సలోమి తదితరులు పాల్గొన్నారు.

## 'కెమ్ ఈఈఈ-2024' సదస్సు ప్రారంభం


సదస్సు షెడ్యూల్ విడుదల చేస్తున్న ప్రముఖులు, నిర్వాహకులు

**దాబాగార్డెన్స్:** డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ ఇంజినీరింగ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21వరకు విశాఖలోని ఓ హోటల్‌లో సోమవారం కెమికల్, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్ (కెమ్ ఈఈఈ-2024) ట్రెండ్స్‌పై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. శక్తి పరివర్తన ప్రాముఖ్యత, ఉద్యోగ కల్పనలో స్టార్టప్‌ల పాత్రను ఐఐటీ ఢిల్లీ ప్రొఫెసర్ సుద్దసత్వబసు వివరించారు. ఎన్‌టీపీసీతో హైడ్రోజన్ ఉత్పత్తిపై పారిశ్రామిక ప్రాజెక్టులు, ఐఐపీఈ వృద్ధి, రూ.50 కోట్లకు పైగా పరిశోధన నిధులు పొందామని ఐఐపీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్ తెలిపారు. బాలికలకు ఫెలోషిప్‌లు, శాండ్‌విచ్ పీహెచ్‌డీల గూర్చి వివరించారు. కెమ్ ఈఈఈ-2024 కన్వీనర్ ప్రొఫెసర్ హేమంత్‌కుమార తన్నేరు కాన్ఫరెన్స్ థీమ్‌ను పరిచయం చేస్తూ ఈవెంట్ స్పాన్సర్స్ విద్యాన్ బయో, సెర్బ్-ఇండియా, ఇండియన్ బ్యాంక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సదస్సు షెడ్యూల్‌ను సదస్సు అధ్యక్షుడు ప్రొఫెసర్ శేషగిరిరావు అంబటి వివరించారు. ఐఐపీఈ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో కొనసాగుతున్న కార్యకలాపాలను కెమ్ ఈఈఈ-2024 ప్రతినిధి ప్రొఫెసర్ వెంకటరెడ్డి పల్లేటి వివరించారు. కార్యక్రమంలో ఐఐపీఈ రిజిస్ట్రార్ రాంఫెల్ ద్వివేది, ప్రొఫెసర్ దీపాంకర్ పాల్, నిర్వాహకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## కిటికీ గ్రిల్ పడి విద్యార్థికి గాయాలు


ఎంఈవో పద్మావతితో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం ప్రతినిధులు (ఇన్‌సెట్) గ్రిల్ ఊడిపోయిన కిటికీ

**ఆనందపురం :** మండలంలోని వెల్లంకిలో ఉన్న రవీంద్రభారతి పాఠశాల కిటికీ గ్రిల్ జారిపడి ఆదివారం ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. పాఠశాల యాజమాన్యం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచగా మంగళవారం వెలుగుచూసింది. స్థానికులు, పాఠశాల విద్యార్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన వివేక్ ఇక్కడ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. అతడిని చూడడానికి వివేక్ అక్క నందిని కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వచ్చింది. ఆమె పాఠశాల నుంచి తిరిగి వెళ్తుండగా పాఠశాల నాలుగో ఫ్లోర్‌లో ఉన్న కిటికీ గ్రిల్ ఊడి నందిని తలపై పడింది. దీంతో ఆమె తలకు బలమైన గాయం కావడంతో సంగివలసలోని ఎన్ఆర్ఐ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. కాగా ఈ విషయం తెలుసుకున్న నందిని తండ్రి భాస్కరరావు, మరికొంత మంది పాఠశాలకు చేరుకొని సంఘటనపై పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. పోలీసులకు ఆస్పత్రి వర్గాల వారు సమాచారం ఇచ్చారు.

**ఎంఈవో విచారణ**

ఆనందపురం ఎంఈవో ఎస్ఎస్ పద్మావతి మంగళవారం పాఠశాలను సందర్శించి విచారణ జరిపారు. గ్రిల్ ఊడిపడిన కిటికీలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నాలుగో ఫ్లోర్‌లో నిర్వహిస్తున్న హాస్టల్ గదులు కిటికీల గ్రిల్స్ అన్నీ బలహీనంగా ఉన్నాయని వెల్లడించారు. అన్ని గ్రిల్స్‌ను సరిచేసేంత వరకూ ఆ ఫ్లోర్‌లో హాస్టల్ నిర్వహించరాదని ఆదేశాలిచ్చారు.

**విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి**

అకారణంగా గాయాల పాలైన విద్యార్థి కుటుంబాన్ని పాఠశాల యాజమాన్యం ఆదుకోవాలని ఏబీవీపీ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.

### వైభవంగా గిరి ప్రదక్షిణ

**అక్కిరెడ్డిపాలెం:** శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరుడి గిరి ప్రదక్షిణను సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల శ్రీ వేంకటేశ్వర మరియు వినాయక స్వామి వార్ల ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గిరి ప్రదక్షిణ చేశారు.

## చిన్నారుల పెద్ద మనసు

- అనాథల చదువుకు విద్యార్థుల ఆసరా
- పాకెట్ మనీ కూడబెట్టి రూ.10వేలు అందజేత


స్ఫూర్తి సంస్థ నిర్వాహకుడికి విరాళం అందిస్తున్న విద్యార్థులు

**మల్కాపురం:** సాయం చేయాలనే సంకల్పం ఉండాలే గానీ, వయసుతో పని లేదని రుజువు చేశారు ఆ విద్యార్థులు. తల్లిదండ్రులు పాకెట్‌మనీగా ఇచ్చిన డబ్బులను పోగేసి అనాథ పిల్లల చదువు కోసం సాయమందించి, పెద్దమనసును చాటుకున్నారు. 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు అనాథల చదువుకు ఏదైనా సాయం చేయాలనే ఆలోచన వచ్చింది. దీంతో ప్రతీరోజూ తమ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని గతేడాది నవంబర్ నుంచి ఈ నెల 19వ తేదీ వరకు కిడ్డీ బ్యాంక్ (డిబ్బీ)లో దాచుకున్నారు. ఆ మొత్తం రూ.10వేలు అవడంతో, సోమవారం గాజువాకలోని స్ఫూర్తి అనాథాశ్రమంలోని బాలల చదువు కోసం సాయంగా వినియోగించాలని కోరుతూ సంస్థ అధినేత రాజేష్‌కు అందజేశారు. వారిని పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు, ఉపాధ్యాయిని అరుణ అభినందించారు.